వనదేవతలకు జనహారతి



కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేటలో ఎత్తు బంగారం మొక్కు చెల్లిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



జూలపల్లి: అబ్బాపూర్ జాతరలో మొక్కులు చెల్లిస్తున్న జనం

- జాతరలో ఎత్తు బంగారం మొక్కులు
- వనదేవతలను దర్శనం చేసుకున్న భక్తులు

జూలపల్లి: మండలంలోని తేలుకుంట, అబ్బాపూర్‌లో జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతరలో ఆఖరిరోజు శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు అబ్బాపూర్ జాతరలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ కుటుంబ సమేతంగా తేలుకుంట, అబ్బాపూర్‌లో మొక్కులు చెల్లించారు. కార్యక్రమాల్లో జాతర కమిటీ అధ్యక్షులు చొప్పరి శేఖర్, పసునూటి శ్రీనివాస్, ఎంపీటీసీలు దండె వెంకటేశం, కత్తెర్ల శ్రీనివాస్, మాజీ సర్పంచులు మల్లేశం, పద్మశ్యాం, సభ్యులు జంగిల లచ్చయ్య, లక్ష్మీనారాయణ, చెంద్రయ్య, బాలసాని శ్రీనివాస్, ధర్మయ్య, రాములు ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేట, పెగడపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో శుక్రవారం వేలాది మంది భక్తులు తరలివచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ జూకటి శిరీష దంపతులు వనదేవతలను దర్శించుకున్నారు. తహసీల్దార్ జాహెద్ పాషా, ఎస్సై ఓంకార్ యాదవ్, ఏఎస్సై నీలిమ, సిబ్బందితో పాటు పెట్రోలింగ్ నిర్వహించి శాంతిభద్రతలు పర్యవేక్షించారు. జాతర కమిటీ సభ్యులు భక్తులకు తాగునీటి వసతి, విద్యుత్, విడిది సౌకర్యాలు కల్పించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో పులి ఇంద్రకరణ్‌రెడ్డి–మౌనికరెడ్డి దంపతులు విజయరమణారావు పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలుపు సాధించాలని మొక్కుకోగా సమ్మక్క తల్లికి ఎత్తు బెల్లం తూకం వేసి మొక్కు చెల్లించుకున్నారు. పెగడపల్లి, పెద్దరాతుపల్లి, మీర్జంపేట గ్రామాల్లో సమ్మక్క తల్లికి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఎత్తు బెల్లం సమర్పించారు. ఎమ్మెల్యే వెంట ఆప్కాబ్ మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గానవేన సదయ్య, ఎంపీటీసీలు నిర్మల మల్లారెడ్డి, మాజీ సర్పంచులు సతీశ్, సుజాత, ఓరుగంటి కొమురయ్య, నాయకులు తిరుపతిరెడ్డి, సదయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, జాతర కమిటీ చైర్మన్లు ఉన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో ఎత్తు బంగారం మొక్కులు



ఎలిగేడు: గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎలిగేడు: మండలంలోని ఎలిగేడు–లాలపల్లి గ్రామాల్లోని సరిహద్దున గల పెండ్లి పోరుగుట్ట వద్ద జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వన దేవతలకు మొక్కులు చెల్లించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కోశాధికారి భూర్ల సత్యనారాయణ, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, రాయనర్సయ్య, తాజా మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేటలో క్యూలైన్లో భక్తులు,



డప్పుచప్పుళ్లతో దర్శనానికి వస్తున్న భక్తులు



వైద్య సేవలందిస్తున్న వైద్యసిబ్బంది



వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ఓటుహక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

రామగిరి: ఓటుహక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి కనీస బాధ్యత అని మంథని ఆర్డీవో హనుమానాయక్ అన్నారు. శుక్రవారం సెంటినరీకాలనీలో గల జేఎన్టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన మంథని నియోజకవర్గ క్యాంపస్ అంబాసిడర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని, ఓటుహక్కు వినియోగించుకొని మంచి పాలకులను ఎన్నుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులని, మంచి నాయకులను ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధమన్నారు. ఓటు నమోదుకు ప్రత్యేక యాప్‌లున్నాయని, ఫారం–6 ద్వారా సైతం నమోదు చేసుకోవాలన్నారు. ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, పీడీ పింగిళి కృష్ణారెడ్డి, అంబాసిడర్లు ఇ.సాయి, కె.సాయిగీత, ఎస్.జాస్మిన్, జె.విష్ణు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి సహకరించాలి

సుల్తానాబాద్: మున్సిపల్‌లోని కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆరో వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్, కమిషనర్ వేణుమాధవ్‌ను కలిసి విన్నవించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సుల్తానాబాద్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు న్యాతరి దేవేందర్ కుమార్ ఉన్నారు.

నర్సరీ సందర్శన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ నర్సరీని ఎంపీడీవో ఎం.ఏ.అలీం శుక్రవారం సందర్శించి మొక్కలను పరిశీలించారు. నర్సరీలో మొక్కల స్థితిగతులు, నర్సరీలో పెంచుతున్న మొక్కల రకాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లిలోని ఫీల్డ్ కెనాల్, నర్సరీలను తనిఖీ చేశారు. మొక్కల పెంపకానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు.

జాతరలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనుల్లో పంచాయతీ కార్మికులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ జాతరలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. రెండోరోజు జాతరలో వేలాదిగా భక్తులు తరలిరావడంతో ప్రాంగణం పూర్తిగా అపరిశుభ్రంగా మారింది. ఎంపీడీవో ఎం.ఏ.అలీం జాతరలో పర్యటిస్తూ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు ట్రాక్టర్‌లో చెత్తను తరలించారు.

మంత్రి కృషితో గ్రామాల అభివృద్ధి



మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ కొండ శంకర్

మంథని: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కృషితో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మంథని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిల్లపల్లి గ్రామంలో రూ.20లక్షలతో చేపట్టే సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీటీసీలు గుమ్మడి సత్యవతి రాజయ్య, పూదరి లక్ష్మీ లచ్చయ్య, నాయకులు ఆరె సతీశ్, ఉడుత పోచం ఉన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీశ్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలో ప్రధాన రహదారి మధ్యలో నుంచి డ్రైనేజీ పైపులైన్ వేసి శాశ్వత సమస్యను పరిష్కరించారు. శుక్రవారం వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు రెండు గంటల వ్యవధిలోనే రోడ్డును అడ్డంగా తవ్వి భూగర్భంలో పైపులైన్ వేసి డ్రైనేజీ నీటిని పక్కనున్న కల్వర్టులోకి మళ్లించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా ఫోర్‌లైన్ రహదారి



కేశోరాం డెయిరీఫాం సమీపంలో ఫోర్‌లైన్ రహదారిపైకి వంగిన చెట్ల కొమ్మలు

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్ ప్లాజా నుంచి బసంత్‌నగర్ బస్టాండ్ వైపు వెళ్లే ఫోర్‌లైన్ రహదారి స్థానిక కేశోరాం డెయిరీఫాం వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది. దీంతో రహదారిపై వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణకు హరితహారంలో భాగంగా ఫోర్‌లైన్ రహదారిని ఆనుకుని అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించారు. దీనిలో భాగంగా పెంచిన మొక్కల కొమ్మలు ప్రస్తుతం ఫోర్‌లైన్ రహదారిపైకి వంగి ఉన్నాయి. దీంతో స్థానికంగా రహదారి ఇరుకుగా మారి ప్రమాదాలకు నెలవుగా మారింది. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కేంద్రం తీరుపై నల్లబ్యాడ్జీలతో నిరసన

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం పాల్పడుతున్న దాడులకు నిరసనగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పైలాన్ వద్ద నిరసన తెలిపి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజన్న, ఐ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

రామగిరి: హర్యానాలో యువ రైతు శుభకరణ్‌సింగ్ మృతికి సంతాపంగా శుక్రవారం సెంటినరీకాలనీలో సీఐటీయూ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, జాతీయ రైతు సంఘాల పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు కొమురయ్య, హమీద్ పాషా, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.ప్రభాకర్, ఎస్.రాజయ్య, బి.రాజమల్లు, ఎస్.తిరుపతి, ఎండీ.హబీబ్ పాషా పాల్గొన్నారు.

రైతును కాల్చి చంపడం దారుణ చర్య

మంథని: పంజాబ్ సరిహద్దుల్లో యువరైతును కాల్చి చంపడం దారుణమైన చర్య అని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ అన్నారు. శుక్రవారం మంథనిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఖండించారు. నాయకులు చందు, మల్లేశ్, అగ్గిమల్ల సతీశ్, దామర సమ్మయ్య ఉన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

కాల్పులపై విచారణ జరిపించాలి

సుల్తానాబాద్: ఢిల్లీలో రైతులపై జరిగిన కాల్పులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాల్పులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి వ్యతిరేకమైన రైతు చట్టాలను రద్దు చేసి, రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులతో చర్చలు జరిపి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు.

డివిజన్లలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ శ్రీనివాస్ బైక్‌పై గాంధీచౌక్ చౌరస్తా, తిలక్‌నగర్, విఠల్‌నగర్, రమేశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఓ ప్రాంతంలో చెత్తను తొలగించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో ట్రాలీ డ్రైవర్ రాకపోడంతోనే చెత్త పేరుకుపోయిందని స్థానికులు చెప్పడంతో, వెంటనే చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం బల్దియా ఆవరణలో చెత్త సేకరణకు కొన్ని ఆటో ట్రాలీలు వెళ్లకపోవడంపై ఆరా తీశారు. డ్రైవర్లు మేడారం జాతరకు వెళ్లడంతోనే నిలిచిపోయినట్లు సిబ్బంది తెలిపారు. అలాగే బల్దియా కార్యాలయంలోని ఎలక్ట్రికల్ విభాగంతోపాటు బ్లీచింగ్ పౌండర్ నిల్వ ఉంచుతున్న గదులను కమిషనర్ తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న గదులను వెంటనే శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. బల్దియా ఆవరణలో ఉన్న ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఆటోట్రాలీతో పాటు ట్రాక్టర్లు, స్క్రాప్‌ను పరిశీలించి వివరాలు సేకరించారు.



బైక్‌పై తిరుగుతూ తనిఖీ చేస్తున్న కమిషనర్

నిరుపయోగంగా మొబైల్ బయో టాయిలెట్స్



కోల్‌సిటీ: జాతరలు, సభలు, సమావేశాలు, ఉత్సవాలు జరిగినప్పుడు అక్కడికి హాజరైన మహిళల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు, పిల్లలకు పాలు పట్టేందుకు వీలుగా ప్రత్యేక విభాగాలతో రూపొందించిన ఓ బస్సును గతంలో రామగుండం నగరపాలక సంస్థ అధికారులు రూ.50లక్షలతో కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈ బస్సును వినియోగించకుండా నిర్లక్ష్యంగా చెట్లకింద వదిలేశారు. ఈ బస్సు తరహాలోనే రెండు మొబైల్ బయో టాయిలెట్ వాహనాలు కూడా ఉన్నాయి. బస్సుతోపాటు ఈ మొబైల్ బయో టాయిలెట్ వాహనాలను బల్దియా కార్యాలయంలో మూలకు పడేశారు. ఈ వాహనాలను వినియోగంలోకి తీసుకొస్తే ఉపయోగకరంగా ఉంటుంది. బల్దియా పాలకులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

గోదావరిఖనిటౌన్: జనగామ సమ్మక్క–సారలమ్మ జాతర ఆదాయం నుంచి 30శాతం నిధులు జనగామ శ్రీత్రిలింగేశ్వర రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కేటాయించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకుడు తోకల రమేశ్ రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. రమేశ్ మాట్లాడుతూ జనగామ శివాలయం ప్రాంగణం నుంచే కంకవనం తీసుకెళ్తూ జనగామ ప్రజలు జాతరకు అన్నివిధాలా సహకారం అందిస్తున్నారని గుర్తు చేశారు. కొన్నేళ్లుగా జాతర ఆదాయం నుంచి 30శాతం నిధులు కేటాయించాలని కోరుతున్నప్పటికీ జాతర కమిటీ మొదట్లో రూ.10వేలు ఇప్పుడు రూ.30వేలు మాత్రమే కేటాయిస్తున్నారని తెలిపారు. జాతర ఆదాయంలో 30శాతం జనగామ శివాలయం అభివృద్ధికి కేటాయించి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. జనగామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అర్కూటి శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు తుంగపిండి లింగస్వామి, ఊదరి రవీందర్, దుర్గం భూమయ్య, రవితేజ పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ హరిహర ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం ప్రాతకాల పూజ, మంత్రపుష్పం, మంగళహారతి, నిత్యారాధన, నైవేద్యం, రాత్రి శ్రీదేవి, అలువేలు మంగ సహిత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పురోహితులు ప్రవీణ్ శర్మ, ముఖేశ్ మిశ్రా, సాయివిశాల్ శర్మ, రఘునాథ శర్మ కల్యాణం జరిపించారు. అనంతరం అన్న సంతర్పన చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు యెరబాటి రాజేశ్వరస్వామి, హైకోర్టు న్యాయవాది అశోక్‌రావు, వ్యాపారవేత్త ఇమ్మడి శ్రీనివాస్ దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రఘుపతిరావు, కిషన్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్ర విజయవంతం చేయండి

మంథని: జిల్లాలోని రామగుండం, మంథని నియోజకవర్గంలో శనివారం నుంచి నిర్వహించే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ కోరారు. శుక్రవారం మంథనిలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. సంకల్ప యాత్రలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. యాత్రలో కామారెడ్డి, ముథోల్ ఎమ్మెల్యేలు కాటపల్లి వెంకటరమణరెడ్డి, రామారావు పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతి కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్యప్రకాష్, సెన్సార్ బోర్డు మెంబర్ బోగోజు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి, బీఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలువేరు సతీశ్, మండల ఇన్‌చార్జి మట్ట శంకర్ ఉన్నారు.

మూడోసారి విజయ దుందుభి

గోదావరిఖని: బీజేపీ ప్రజా సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి కోరారు. పీఎం నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ, రానున్న దేశవ్యాప్త ఎన్నికల్లో మూడోసారి మోదీ సర్కార్‌తో కమలం జెండాలతో విజయ దుందుభి మోగించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాసంకల్పయాత్ర శనివారం రామగుండం నియోజకవర్గానికి చేరుకోనుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

జాతర ఆవిర్భావ వ్యవస్థాపక కుటుంబానికి సన్మానం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరినది ఒడ్డున జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతర 42ఏళ్ల నుంచి సాగుతోంది. కాగా జాతర నిర్వహణ వ్యవస్థాపకులు, ఆవిర్భావానికి మూలకర్తలైన స్వర్గీయ జాలిగామ రామ్‌కిషన్‌రావు అలియాస్ బయ్యాజీ కుటుంబసభ్యులు హైదరాబాద్ నుంచి జాతరకు వచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వనదేవతల గద్దెల ప్రాంగణంలోనే జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హన్మాన్‌రెడ్డి, ఆవుల చంద్రయ్య ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. జాతరను దర్శించుకున్న వారిలో స్వర్గీయ రామ్‌కిషన్‌రావు వారసులు జాలిగామ నారాయణరావు, కూతురు హర్కర పద్మ–వెంకట్రావు, జాలిగామ గీత–భీంరావు ఉన్నారు. కాగా జాతరను ఉద్దేశించి వారు మాట్లాడారు. తమ తండ్రి స్వర్గీయ జాలిగామ రామ్‌కిషన్‌రావు అలియాస్ బయ్యాజీ గోలివాడలో నివాసముంటూ స్థానికంగా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించేవారు. ఒకరోజు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లగా ఒడ్డున కుంకుమ భరణి, ఎర్రబట్ట కనిపించాయి. రాత్రి వనదేవతలు కలలో వచ్చి ప్రతీ రెండేళ్లకోసారి కొలవాలని, ఇదే ఒడ్డున జాతర నిర్వహించాలని చెప్పడంతో ఆనాటి నుంచి జాతర కొనసాగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



జాలిగామ రామ్‌కిషన్‌రావు కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న జాతర కమిటీ

ఘనంగా ఉర్సు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలోని దర్గాలో గురువారం రాత్రి ఉర్సు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం

పెద్దపల్లిరూరల్: ఉన్నది లేనట్టు..లేనిది ఉన్నట్టు భ్రమలు కల్పిస్తూ అందరినీ మంత్రముగ్ధులను చేశారు ఇంద్రజాలికులు. ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెద్దపల్లిలోని రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మేజిక్‌రాజా, మల్లేశం, హరి, కత్తుల కిషన్‌తో పాటు పలువురు మెజీషియన్లు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రిక్రియేషన్ క్లబ్ ప్రతినిధులు కొట్టె సదానందం, దేవసాని ధర్మయ్య, గడ్డాల శ్రీనివాస్ ఉన్నారు.



కార్యక్రమం ప్రారంభిస్తున్న క్లబ్ నిర్వాహకులు